క్లుప్తంగా

దుర్గమ్మ సన్నిధిలో పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

రేపు ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

కడప కల్చరల్ : జిల్లా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలచే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 73 మందికి గురువారం అవార్డీ టీచర్స్ అసోసియేషన్, సంస్కృతి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సత్కారం చేయనున్నారు. మంగళవారం విద్వాన్ గానుగపెంట హనుమంతరావు తన కార్యాలయంలో విలేకరులకు ఈ విషయం తెలిపారు. ప్రొద్దుటూరులోని శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ సత్కారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో నిర్వాహక కమిటీ అధ్యక్షులు రామలింగ రాజు, ఒంటేరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భౌతిక శాస్త్రంలో డాక్టరేట్



సునీత

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల భౌతికశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి బింగి సునీతకు రాయలసీమ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆర్ట్స్ కళాశాల భౌతికశాస్త్ర ఆచార్యులు డా. బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఆప్టికల్ క్యారక్టరైజేషన్ ఆఫ్ రేర్ ఎర్త్ అయాన్స్ డోప్డ్ కాడ్మియం అల్యూమినియం ఫ్లోరో లెడ్ బోరేట్ గ్లాసెస్' అన్న అంశంపై ఈమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగుళూరులో ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సెంటర్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పాస్/ఫెయిల్ అయిన అభ్యర్థులు 18-26 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. 35 రోజులపాటు బెంగుళూరులో శిక్షణ ఉంటుందన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలన్నారు.

ప్రశ్నపత్రాలు కూడా ఇవ్వలేరా

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వం విద్యార్థులు పరీక్ష రాసేందుకు కనీసం ప్రశ్నాపత్రాలు కూడా ఇవ్వలేదా అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఎఫ్‌ఏ-2 పరీక్షల్లో ఉపాధ్యాయులు ప్రశ్నాపత్రాలు బోర్డుపై రాయాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇకనైనా ఉపాధ్యాయులు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు విరమించాలని ఆయన సూచించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

కడప అర్బన్ : కడప నగరంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి తెలియజేశారు. మంగళవారం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బ్రహ్మయ్య పెట్రోల్ బంక్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న చంద్రశేఖర్, రాముడు అనే ఇరువురిని సీఐ ఆధ్వర్యంలో ఎస్ఐ తులసీనాగప్రసాద్ అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 20 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేశారు.

సౌకర్యాల కల్పనకు కృషి



ఆటస్థలాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్ : కడప నగర శివార్లలో ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)లో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని ప్రిన్సిపాల్ ఏ. సురేఖ తెలియజేశారు. మంగళవారం కడప రిమ్స్ వైద్య కళాశాల భవనం ముందు భాగాన ఖాళీ స్థలాన్ని ఆట స్థలంగా తయారు చేశారు. ఆట స్థలాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వివిధ రకాల ఆటలను ఆడుకునేందుకు అవకాశముందన్నారు. ఈ కార్యక్రమంలో కడప రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు నాయక్, రిమ్స్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా ఏపీ

ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా



వైద్యులతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యవంతమైన రాష్ట్రంగా అవతరిస్తుందని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పెద్ద దర్గా సమీపంలో నిర్వహించిన 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. మండీ బజార్, బళ్లారిరోడ్డు, అబ్దుల్ నబీ స్ట్రీట్, ఖలీల్‌నగర్, నకాష్ ప్రాంతాలకు చెందిన ముస్లిం మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్‌బాషా శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. ఎక్కడెక్కడ ఏఏ పరీక్షలు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం మీడియాతో మాట్లాడుతూ ప్రతి పేదవారికి వైద్యాన్ని వారి గడప వద్దకు అందించడానికే 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం అమలు చేయడం జరుగుతోందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ఈ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యంగా వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి కార్పొరేట్ వైద్యాన్ని ప్రజలు ముంగిటకు తీసుకురావడం జరిగిందన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వలంటీర్లు, ఏఎన్ఎంలు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకొని వారికి టోకెన్ అందజేస్తారని, ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించే రోజు వారికి పరీక్షలు, మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో గైనకాలజీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్, కంటికి సంబంధించిన వైద్యులు ఉన్నారని, వారు అందరికీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. రాబోవు రోజుల్లో వారికి నెలకు అవసరమైన మందులన్నీ హెల్త్ సెంటర్ ద్వారా అందజేస్తారన్నారు. ఈసీజీ, రక్త పరీక్షలు చేయడంతోపాటు అవసరమైతే పెద్ద ఆసుపత్రులకు కూడా ఇక్కడి నుంచే రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. దేశంలో మరే రాష్ట్రంలో కూడా ఇలాంటి బృహత్తర కార్యక్రమం లేదన్నారు. ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ డా. నాగరాజు, కార్పొరేటర్లు అరీఫుల్లా బాషా, ఎస్‌ఏ షంషీర్, రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, తోట క్రిష్ణ, డా. వి.ప్రతాప్‌రెడ్డి, డా. శివానాయక్, డా. సతీష్ రెడ్డి, సుబ్బారెడ్డి, పవర్ అల్తాఫ్, మియ్యా, టీపీ వెంకట సుబ్బమ్మ, సునీత పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వినియోగించుకోవాలి

కడప కార్పొరేషన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ఒక అద్భుత కార్యక్రమమని, ప్రజలు వినియోగించుకోవాలని వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్ ఖాన్ అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్య రంగాలను గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేశాయన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కాగానే ఆయా రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల రూపురేఖలను మార్చి వేశారన్నారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను మెరుగ్గా తీర్చిదిద్దారన్నారు. ప్రస్తుతం ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారన్నారు.

అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో వైద్యులు అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : ప్రజలందరికీ మంచి ఆరోగ్యం అందించాలన్నదే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక జడ్పీ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్ తదితర శాఖల స్టాల్‌లను పరిశీలించి మాట్లాడారు. జగనన్న మీ కోసమే ఇవన్నీ చేయిస్తున్నాడని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీఎం పేద ప్రజలందరికి స్పెషలిస్ట్ వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. రెండు వారాల పాటు ఇంటింటికి తిరిగి రోగులను గుర్తించి వారిని శిబిరాలకు చేర్పించి రూ.1200 విలువ జేసే బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారన్నారు. అన్ని విభాగాల డాక్టర్లను ఒక చోటికి చేర్చి గ్రామంలోనే స్పెషలిస్ట్ వైద్య సేవలు అందించడం దేశంలో ఎక్కడా లేదన్నారు. గతంలో కూడా కంటి వైద్య పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు, మందులు పంపిణీ చేశారన్నారు. నాడు-నేడు ద్వారా వైద్య శాఖలో అనేక సౌకర్యాలు కల్పించి 58 వేలకు పైగా వైద్య సిబ్బంది పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా జగనన్నదేనన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలలు మాత్రమే ఉన్నాయని, ఇపుడు జగనన్న మరో 17 కళాశాలలు తీసుకు వచ్చాడన్నారు. ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం అందించాలన్నదే సీఎం లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో నగర కమిషన్ రాజశేఖర్, ఏడీఏ నరసింహారెడ్డి, స్పెషలిస్ట్ డాక్టర్లు, వైద్య సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని దుగ్గాయపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని వెంకటాపురం వీవర్స్ కాలనీలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి పరిశీలించి మాట్లాడారు. అనంతరం వైద్య నిపుణులు వెంకటేశ్వర్‌రెడ్డి, ఉబేదుల్లా, హేమంత్, ప్రసన్న లక్ష్మిల ఆధ్వర్యంలో 168 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందచేశారు. నలుగురిని ఉన్నత స్థాయి వైద్య సేవలకై రెఫర్ చేశారు. అనంతరం వీరారెడ్డి చేతుల మీదుగా కంటి అద్దాలను, మందులను, ఆయుష్మాన్ భవ ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. నోడల్ ఆఫీసర్ వెంకటచంద్రారెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెద్దక్క, ఎంపీడీవో జుబేద, తహసీల్దార్ శంకర్‌రావు, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం

కడప కార్పొరేషన్ : పేద ప్రజల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిత్యం పరితపిస్తున్నారని, ఆయన్ను ప్రజలు మళ్లీ ఆశీర్వదించాలని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా అన్నారు. మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా...28/2 సచివాలయ పరిధిలోని మండి బజార్ లోని వాసవి అపార్ట్‌మెంట్ నుండి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వాటివల్ల వారికి కలిగిన అభివృద్ధిని తెలిపి, అందుకు సంబంధించిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పుట్టా సుబ్బరత్నమ్మ అనే మహిళ తనకు వైఎస్ఆర్ ఆసరా, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదుల ద్వారా రూ. 10, 50, 000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. మండల రజనీ మాట్లాడుతూ తనకు జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదుల ద్వారా రూ. 6,50,000 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది. తమ చల్లని దీవెనలతో వైఎస్ జగన్ మళ్లీ సీఎం కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో 28వ డివిజన్ కార్పొరేటర్ షేక్ అరీఫుల్లా, క్లస్టర్ పార్టీ అధ్యక్షులు సుభాన్‌బాషా, తోటక్రిష్ణ, పార్టీ నాయకులు బాలక్రిష్ణా రెడ్డి, ఎన్. సుబ్బారెడ్డి, పత్తిరాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రాధ, విజయకుమారి పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా అబ్దుల్ సుభాన్

కడప కార్పొరేషన్ : కడప వక్ఫ్ బోర్డు డైరెక్టర్‌గా రూపనగుడి అబ్దుల్ సుభాన్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా వక్ఫ్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం అబ్దుల్ సుభాన్ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అంజద్ బాషా మాట్లాడుతూ సుభాన్ విస్తృతమైన అనుభవం, సమాజసేవ పట్ల అంకిత భావం వక్ఫ్ బోర్డుకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 49వ డివిజన్ ఇన్‌చార్జి మధువర్ధన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ కేతబోయిన శ్రీనివాసులు, ఏ. హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలు విద్యార్థులకా.. ఉపాధ్యాయులకా..

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎఫ్‌ఏ-2 పరీక్షలు విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించేవిగా కాకుండా ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షించేవిగా ఉన్నాయని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆరోపించారు. మంగళవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. సెల్‌ఫోన్లో ప్రశ్నాపత్రాలను చూసుకుని విద్యార్థులకు బోర్డుపై రాసి పరీక్షలు నిర్వహించాలని తెలపడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాస్ అహ్మద్, నాయకులు పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుడు జయదేవవర్మ మృతి

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, కళాకారుడు ఆర్‌వీ జయదేవ వర్మ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఈయన వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు, ప్రవృత్తి రీత్యా నాటక కళాకారుడు. 12వ ఏటనే నాటక రంగంలో ప్రవేశించి దాదాపు 3వేల నాటక ప్రదర్శనలు ఇచ్చారు. సత్యహరిశ్చంద్ర, మహిషాసురమర్దిని, పల్నాటి యుద్ధం, మాయాబజార్ తదితర నాటకాలతో జయదేవ వర్మ అందరినీ ఆకట్టుకున్నారు. ఆయన మృతి పట్ల జిల్లా రచయితల సంఘం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, నటులు చంద్రశేఖర్ రాజు, కంభం పాములేటి సంతాపం తెలిపారు

ఆదర్శ గ్రామ పంచాయతీకి కృషి చేద్దాం

చెన్నూరు : ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషిచేస్తే ఆదర్శగ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుదాం అని సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డిలు అన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభను నిర్వహించారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నారు. చెన్నూరు గ్రామపంచాయతీలో గతంలో 16 వేల జనాభా ఉండేదని ఇప్పుడు ప్రస్తుతం 18 వేలకు పెరిగిందన్నారు. 14,వ 15వ ఆర్థిక ఫైనాన్స్ నిధులే కాకుండా గ్రామపంచాయతీ శానిటేషన్ యాక్షన్ ప్లాన్ చేసి పంపడం ద్వారా గ్రామ పంచాయతీకి మరిన్ని నిధులు వస్తాయన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలి



హెడ్ పోస్టాఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న వామపక్ష రైతు సంఘాల నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని వామపక్ష రైతు కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, బి దస్తగిరి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా హెడ్ పోస్ట్ ఆఫీస్. బిఎస్ఎన్ఎల్ కార్యాలయాల ముందు కేంద్ర కమిటీ వామపక్ష రైతు కార్మిక సంఘాల పిలుపు మేరకు బ్లాక్ డే నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులపై కాల్పులు జరిపి రైతుల ప్రాణాలను బలి తీసుకున్న ఘటనకు బాధ్యుడైన మంత్రిని బర్త్ రఫ్ చేయనందుకు నిరసనగా దేశ వ్యాప్తంగా నరేంద్ర మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతుల పంటలకు మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం వెంటనే తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి సుబ్బారెడ్డి, అన్వేష్, గోపాలకృష్ణయ్య ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బయ్య చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠ భరితంగా షటిల్ టోర్నీ

నందలూరు (రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో ఉమ్మడి కడప జిల్లా ఆధ్వర్యంలో స్మాషర్స్ గ్రూప్ నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ టోర్నమెంట్ విజేతలుగా రాజంపేటకు చెందిన శంకర్, షావలిలు నిలిచి రూ. 6 వేలు నగదుతో పాటు ట్రోఫీని అందుకున్నారు. ఉత్కంఠ భరితంగా జరిగిన ఫైనల్‌లో నందలూరుకు చెందిన న్యాయవాది మోహన్, మస్తాన్‌లు గట్టి పోటీనిచ్చారు. కోడూరుకు చెందిన మురళీ, సూరి తృతీయ బహుమతి రూ. 3 వేలు నగదు, షీల్డ్‌లను గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులను రైల్వే అధికారి రవిశంకర్‌లు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో హీరాసింగ్, దినేష్, సాయి, సంతోష్, తేజ, అభినవ్, ధర్మతేజ, ప్రవీణ్, రాఘవ, సుధీర్, జన పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

సిద్దవటం : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి. కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ రంగలక్ష్మి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న ప్రజలు విషజ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నివాస గృహాల చుట్టుపక్కల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి శుక్రవారంను డ్రైడేగా పరిగణించాలన్నారు. నీరు నిల్వ ఉంటే దానిలో దోమలు గ్రుడ్ల వలన దోమలు ఉత్పత్తి అవుతాయన్నారు. దీంతో రోగాలు సోకుతాయన్నారు. జ్వరాలు సోకిన వారు గ్రామ సమీపంలో ఉన్న పీహెచ్‌సీలకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకొని చికిత్స పొందాలన్నారు.

ప్రభుత్వ విద్యార్థులను అభినందించడం హర్షణీయం



ఎస్ఎస్‌సీలో ప్రథమ స్థానంలో నిలిచిన ధనుంజయకు ఈ-సైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : వర్క్యాస్ ఈ-బైక్ షోరూం యజమానులు వేమిరెడ్డి బ్రదర్స్ రామకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డిలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించడం హర్షణీయం అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. 2023 ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు వర్క్యాస్ యాజమాన్యం బహుమతులు ప్రకటించారు. మండల టాపర్‌గా నిలిచిన జ్యోతీబాపూలే స్కూల్‌కు చెందిన దనుంజయ (565/600)కు రూ.38వేలు విలువ ఈ-సైకిల్, ద్వితీయ స్థానంలో నిలిచిన చిన్న చెప్పలి జడ్పీ హైస్కూల్ విద్యార్థి బాలాజీరెడ్డి(561) రూ.10వేలు నగదు, పెద్ద చెప్పలి జడ్పీ హైస్కూల్‌కు చెందిన జగదీశ్వర్‌రెడ్డి (558)కు రూ. 5వేలు నగదు బహుమతులను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్క్యాస్ యాజమాన్యం ప్రతి ఏటా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు బహుమతులు అందిస్తామని చెప్పడం హర్షణీయం అన్నారు. మిగిలిన విద్యార్థులు కూడా బహుమతులు పొందిన విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని పోటీ తత్వంతో చదవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సుభాషిణి, హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, పుల్లారెడ్డి, సాదిక్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీ నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

పంటల మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలి

రాయచోటి అర్బన్ : పంటలకు మద్దతు దర కల్పించే విషయానికి చట్టబద్ధత కల్పించాలని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పి.శ్రీనివాసులు, పీఎల్ నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య పిలుపు మేరకు మంగళవారం రాయచోటిలో నిర్వహించిన బ్లాక్ డేలో భాగంగా నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ మోటర్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును వ్యతిరేకించాలన్నారు. వ్యవసాయ రంగానికి నష్టాన్ని కలిగించే విధానాలను బీజేపీ ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలన్నారు. లఖింపూర్ ఖేరిలో 2021లో నలుగురు రైతుల మృతికి కారణమైన కేంద్రమంత్రి మిశ్రాపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

రాజంపేటలో పశు విజ్ఞాన బడి

రాజంపేట రూరల్ : పాడి రైతులు వారు పోషించుకునే పాడి పశువుల పెంపుదలపై దృష్టి సారించారించాలని పశు సంవర్థకశాఖ ఉపసంచాలకులు డాక్టర్ వై విజయభాస్కరరావు కోరారు. మండల పరిధిలోని అత్తిరాల దళితవాడలో మంగళవారం పశు విజ్ఞానబడిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పాడి పశువుల ఎదకాలన్ని సకాలంలో గుర్తించాలని పాడి రైతులను కోరారు.

రాష్ట్రాభివృద్ధే ముఖ్యమంత్రి లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రాభివృద్ధే తమ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో జేసీఎస్ కన్వీనర్ వీరప్రతాప్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ కృతజ్ఞత సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేసిన వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు మరియు గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ఆప్యాయంగా పలకరించి ఆదరించిన నాయకులకు, ప్రజలకు ఆయన దన్యవాదాలు తెలిపారు. గడప గడపలో ప్రజల నుంచి అందిన సమస్యలను చాలా వరకు పరిష్కరించామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి పనులపై దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు దృష్టి పెట్టారన్నారు. అనంతరం ఎంపీటీసీలు, సర్పంచులు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తమ గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి గురించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏపీపీఎస్ బోర్డు మెంబరు నిమ్మకాయల సుధాకర్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల నాయకులు, కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులు పాల్గొన్నారు.

రైతు పథకాలను ప్రచారం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి

పోరుమామిళ్ల : వ్యవసాయ అనుబంధ, ఉద్యాన శాఖ పథకాలు రైతులకు తెలిసే విధంగా గ్రామస్థాయిలో ప్రచారం జరగాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాదరెడ్డి అధికారులకు, వ్యవసాయ సిబ్బందికి సూచించారు. మంగళవారం పోరుమామిళ్ల మండల కాంప్లెక్స్‌లో ఉన్న రంగసముద్రం ఆర్‌బీకేలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో పశువుల నష్టపరిహారం చెల్లింపులో పెండింగ్ క్లైయిముల గురించి చర్చించారు. పశువులకు సమీకృత దాణా రాయితీ సరఫరాపై, పశు బీమా బడ్జెట్ కేటాయింపులపై చర్చించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కొత్త పంటల సాగు ప్రోత్సహించాలని, బిందు సేద్య పరికరాలు అవసరమున్న రైతులకు త్వరగా అందేలా చూడాలని కోరారు. ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ, ఈకేవైసీ, పంటల సరళి వివరాలు తెలుసుకొన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి నరహరికుమార్, ఉద్యానాధికారి శ్రీనివాససులరెడ్డి, పశువైద్యులు శివ శ్రీనివాసరెడ్డి, చెన్నారెడ్డి, హబ్ మేనేజర్ విజయ లక్ష్మి, మైక్రో ఇరిగేషన్ అధికారి మహేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీ విత్తనాలకు నమోదు చేసుకోండి

వల్లూరు : సబ్సిడీ బుడ్డ శనగ విత్తనాల పంపిణీ ప్రక్రియలో భాగంగా బుదవారం నుంచి నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి సాయిజ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు. వల్లూరు మండలానికి మొత్తం 2460 క్వింటాళ్ల జేజీ - 11 రకం శనగ విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. వీటిని 40 శాతం సబ్సిడీతో రైతులకు సరఫరా చేస్తారన్నారు. క్వింటాల్ పూర్తి ధర రూ 8100 కాగా సబ్సిడీ రూ.3240 పోనూ రైతు వాటా రూ.4860 చెల్లించాల్సి వుంటుందన్నారు. ఒక ఎకరాకు 40 కిలోల విత్తనాలను అందచేస్తామన్నారు. అర ఎకరా వరకు ఒక 20 కిలోల బస్తా, ఒక ఎకరా వరకు రెండు 20 కిలోల బస్తాలు అందిస్తామన్నారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 5 ఎకరాల వరకు 200 కిలోల విత్తనాలను అందచేస్తామని తెలిపారు. మండలంలోని బుడ్డ శనగ పంట సాగు చేసే రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, ఫోన్ నంబర్‌తో సంభందిత రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వీరపునాయునిపల్లె : ప్రభుత్వం 40 శాతం రాయితీతో అందిస్తున్న బుడ్డశనగ విత్తన నమోదు ప్రక్రియను మంగళవారం అనిమెల రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్ బాబు ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం మండలానికి జె.జి11 రకం 3300 క్వింటాళ్లు మంజూరయ్యాని తెలిపారు. క్వింటాల్‌కు ప్రభుత్వం ధర రూ.8110 కాగా 40 శాతం రూ.3240 రాయితీ పోను మిగతాది రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రాజోలి జలాశయాన్ని వెంటనే నిర్మించాలి

ప్రొద్దుటూరు : రాజోలి జలాశయం నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ప్రజా పక్షం అధ్యక్షుడు పుత్తా లక్ష్మీరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలోని డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌కు వినతి పత్రం సమర్పించారు. కుందూనదిపై ఆనకట్ట నిర్మించేందుకు 2008లో శంకుస్థాపన చేశారని, తర్వాత వచ్చిన ప్రభుత్వాలు పనులు ప్రారంభించలేదన్నారు. 2.95 టీఎంసీల సామర్థ్యంతో రూ.1350 కోట్లతో శంకుస్థాపన చేశారన్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో నీరు లేక కేసీ కెనాల్ పరిధిలోని పంటలకు నీటిని విడుదల చేయలేదన్నారు. ఆరుతడి పంటలు వేసుకోవాలని అధికారులు ఇప్పటికే సూచించారని తెలిపారు.